క్లుప్తంగా

తప్పుడు ప్రచారం మానుకోవాలి

● ఎమ్మెల్యే బాలునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

కొండమల్లేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ రాజీనామా చేసి కొడంగల్‌లో పోటీ చేసి గెలవాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని రాజీనామా చేయమని అనడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపదను దోచుకుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్కొక్కటిగా హామీలను అమలుపరుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యాబోధన అందించాలి

మిర్యాలగూడ : ప్రభుత్వం అందజేసిన ఐఎఫ్‌పీ పరికరాల ద్వారా ప్రభుత్వ పాఠశాల ల్లో విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన అందించాలని గణిత ఉపాధ్యాయుడు, ఉత్తమ ఉపాధ్యాయుడు కొర్ర కృష్ణకాంత్‌నాయక్ అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడీ జెడ్పీ హైస్కూల్‌లో గణిత సబ్జెక్టుపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిసోర్స్ పర్సన్ల ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, టీఎంఎఫ్ జిల్లా నాయకులు పండిట్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, లోక్యానాయక్, సైకిలాబ్, రాంరెడ్డి, అరుణ, జ్యోతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే సమగ్రంగా చేపట్టాలి

మిర్యాలగూడ టౌన్ : కుల గణనపై రీ సర్వే చేస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఈసారైనా కుల గణనను సమగ్రంగా చేపట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడెంలోని బీసీ యువజన సంఘం కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన లెక్కల్లో బీసీలను తక్కువగా చూపించడం.. బీసీల రిజర్వేషన్లు తగ్గించే కుట్రలో భాగమేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఆయన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధించుకునేందుకు బీసీలు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో మురళీయాదవ్, సిద్ధం రాజు, గంగాధర్, నరేష్, హరి తదితరులు ఉన్నారు.

రథం నిర్మాణ పనులు ప్రారంభం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని రైల్వే స్టేషన్ కాలనీలో గల శ్రీసాయి దత్తాశ్రమంలో గురువారం శ్రీషిర్డీ సాయి రథం నిర్మాణ పనులను ఆలయ కమిటీ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నాగసాయి విగ్రహానికి, దత్తాత్రేయుడికి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు, విక్రం, వాసు, అంజిబాబు, రవి, పద్మ, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

టీఎన్జీఓ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



టీఎన్జీఓ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గంగపుత్ర సైదులు, నాయకులు

మిర్యాలగూడ : టీఎన్జీఓ సంఘం డైరీ, క్యాలెండర్‌ను గురువారం మిర్యాలగూడలో సంఘం పట్టణ అధ్యక్షుడు గంగపుత్ర సైదులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు వారధులుగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణస్వామి, రామకృష్ణ, సంతోష్, శ్రీహరి, అరుణ్‌కుమార్, సుజాత, అశోక్‌రెడ్డి, సతీష్, ఇస్మాయిల్, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా సరోజిని నాయుడు జయంతి

మిర్యాలగూడ : భారత తొలి మహిళా గవర్నర్, గాన కోకిల సరోజినినాయుడు జయంతి సందర్భంగా ఆంగ్ల భాష దినోత్సవాన్ని గురువారం మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడీ జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి.. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం



మారేపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి

హాలియా : అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారు జామున స్వామి అమ్మవార్ల తిరుకల్యాణం (తలంబ్రాలు) వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్‌బీ శేషాచార్యులు ఆధ్వర్యంలో గజవాహన సేవ, గరుడ సేవ, ఆరగింపు, తీర్థప్రసాద వినియోగం, గరుడ సేవ, సదస్యం పూజలు ఘనంగా జరిగాయి. అనంతరం వేదమంత్రాల నడుమ మంగళవాయిద్యాలతో స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు తలంబ్రాల బియ్యం తెచ్చి దేవుడికి సమర్పించారు. పలువురు దంపతులు స్వామి వారి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేడుక అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, నాయకులు చింతల చంద్రారెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మాలే అరుణసత్యనారాయణరెడ్డి, హైకోర్టు న్యాయవాది హారూర్ అంజాద్, మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, అన్నప్రసాద దాత గుండెబోయిన వెంకన్న యాదవ్, కవిత, చందు యాదవ్, గణేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు గడిదె శ్రీనయ్య, గండికోట సతీష్, ఏడుకొండలు, ఉపేందర్, అనుముల రాధమ్మ, గండు యాదయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని నాగార్జునసాగర్‌లో గల నాగార్జున డిగ్రీ, పీజీ కళాశాలలో వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి గెలుపు కోసం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి సరోత్తమరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జ్ పాపయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, నాయకులు చిలుకూరి శ్యాం, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బంటు సైదులు, కర్నాటి ప్రభాకర్, సజ్జల నాగిరెడ్డి, కొండేటి సరిత, బంటు గిరి, చిల్లంచర్ల అభి, శివరాం, వేణు, శేఖర్, భరత్, రవి, సాంబమూర్తి, విద్యాసాగర్, జానకిరాంరెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు

ముగిసిన మూడు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు



బహుమతులు అందజేస్తున్న దేవస్థాన చైర్మన్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని కోనేరుపురం శివారులోని శ్రీ అలివేలు మంగమ్మ సమేత తిరుమలనాథ స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు బుధవారం రాత్రి ముగిశాయి. పల్నాడు జిల్లా ఇనుమెట్లకు చెందిన గురివిరెడ్డి, కటకం వెంకటేశ్వర్లుకు చెందిన ఎద్దుల జత నిర్ణీత 20 నిమిషాల సమయంలో 2643.05 అడుగుల దూరాన్ని లాగి మొదటి బహుమతి రూ. 80వేలు, రంగారెడ్డి జిల్లా నాదర్గల్‌కు చెందిన వైపీఆర్ బుల్స్ ఎద్దుల జత 2612.03 అడుగుల దూరాన్ని లాగి రెండవ బహుమతి రూ. 60వేలు, నంద్యాల జిల్లా జిల్లెలకు చెందిన గోటక దినేష్‌రెడ్డి ఎద్దుల జత 2600 అడుగుల దూరాన్ని లాగి మూడవ బహుమతి రూ. 40వేలు, టంగుటూరు ప్రకాశం జిల్లాకు చెందిన కోటేశ్వరావు ఎద్దుల జత 2600 అడుగుల దూరాన్ని లాగి నాలుగవ బహుమతి రూ. 30వేలు, కృష్ణా జిల్లా మక్కెన కోటేశ్వరరావుకు చెందిన ఎద్దుల జత 2153.03 అడుగుల దూరాన్ని లాగి ఐదవ బహుమతి రూ. 25వేలు, నల్లగొండ జిల్లా కొప్పోలుకు చెందిన సత్యనారాయణ ఎద్దుల జత 1800 దూరాన్ని లాగి ఆరో బహుమతి రూ. 20వేలు గెలుచుకున్నారు. ఈ బహుమతులను దేవస్థాన చైర్మన్ కల్లూరి వెంకటేశ్వర్లు విజేతలకు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, దేవస్థాన కమిటీ చైర్మన్ కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

ముసాయిదాపై అభ్యంతరాలు తెలపండి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, నాయకులు

మిర్యాలగూడ టౌన్ : ఓటరు ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే ఈనెల 14వ తేదీ వరకు తెలపాలని ఎంపీడీఓ శేషగిరి శర్మ అన్నారు. గురువారం మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై అఖిల పక్ష నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలు ఉండగా పురుషులు 27,488 మంది కాగా మహిళలు 28,467 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాకునూరి బసవయ్య, సీపీఎం మండల కార్యదర్శి మూడావత్ రవినాయక్, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు వస్కుల మట్టయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.సైదయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

త్రిపురారం : గ్రామాల్లోని వార్డుల్లో ఓటర్ లిస్టులో మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ లిస్టుల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయ కుమారి మాట్లాడారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్ లిస్టులను పూర్తి చేశామని, బూత్ లెవల్ వారీగా సరి చేసేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. మండలంలోని గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, కామర్ల జానయ్య, బిట్టు రవి కుమార్, రామచంద్రయ్య, పావనగుండ్ల వెంకటాచారి, బీజేపీ మండల అధ్యక్షుడు రెమడాల రమేష్, చిలుముల శ్రీనివాస్, దైద శ్రీను, నరేష్, సలికంటి బాలకృష్ణ, మడుపు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఓటర్ల ముసాయిదా జాబితాపై ఏమైనా మార్పులు, తప్పులుంటే అభ్యంతరాలు తెలపాలని చింతపల్లి ఎంపీడీఓ సుజాత సూచించారు. గురువారం చింతపల్లిలోని తన కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, బీజేపీ నాయకులు వెన్నం శేఖర్, సీపీఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సీపీఎం మండల కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ఏమైన అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ రమేష్ అన్నారు. గురువారం అడవిదేవులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవిదేవులపల్లి మండలంలో ఐదు ఎంపీటీసీలకు గాను 25 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్, సుపరింటెండెంట్ అమీర్‌అలీ, నాయకులు తదితరులు ఉన్నారు.

పెద్దగట్టు జాతర పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో ఈనెల 16 నుంచి 20 వరకు జరగబోయే లింగమంతుల (పెద్దగట్టు) జాతరను విజయవంతం చేయాలని యాదవ సంఘం నాయకుడు చిలకల సతీష్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడ మండలం రాయినిపాలెంలో జాతర వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు చిలకల వెంకన్న, చిలకల వీరబాబు, చిలకల శ్రీనుయాదవ్, స్థానికులు గంగరాజు, మురళి, సతీష్, మహేష్, రాంబాబు, లింగరాజు, గంగరాజు, నవీన్, నిమ్మల రాములు, నర్సయ్య, మైసయ్య, మహేష్ ఉన్నారు.

పాఠశాలలకు సెలవు ఇవ్వాలి

ఈనెల 17వ తేదీన దురాజ్‌పల్లిలో లింగమంతుల (పెద్దగట్టు) జాతర సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ఇవ్వాలని యాదవ సంఘం నాయకుడు మురళియాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక యాదవ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చింతలచెరువు లింగయ్యయాదవ్, గుండెబోయిన నాగేశ్వర్‌రావుయాదవ్, సురేష్, అంజి, దాసరాజు జయరాజు తదితరులు ఉన్నారు.



పెద్దగట్టు జాతర వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న యాదవ సంఘం నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో విఫలం



సీఎంకు పోస్ట్‌కార్డులు పంపిస్తున్న విద్యార్థినులు

మిర్యాలగూడ : విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.షోయబ్ అన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ గురువారం మిర్యాలగూడ పట్టణంలోని హర్షిత మహిళా డిగ్రీ కళాశాలలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థినులచే సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డులు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దనే పెట్టుకోవడంతో రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. కార్యక్రమంలో చిన్నలాంజియాదవ్, శ్రీకాంత్, సాయి, శ్రీజ, యశ్వంత్, కల్యాణి, ఉమ, ఆది, లక్ష్మి, అంజలి, శ్రీవిద్య, శ్రావణి, దుర్గ, ఇందు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కొండమల్లేపల్లి: రాష్ట్రంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీక్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో జరిగిన ఎస్ఎఫ్ఐ 6వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థలు అరకొర సౌకర్యాలు, అధ్యాపకుల కొరత, తాగునీటి సమస్యలతో కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ఇంత వరకు మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. మండలంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ డివిజన్‌కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడారు. సమావేశంలో సిద్ధు, విజయ్, శివసాయి, మురళి, త్రిష, శైలజ, పూజ, కొర్ర దేవిష్, శరత్, రాము, నందిని పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



చింతపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

చింతపల్లి: పదో తగరతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మోడల్ స్కూల్స్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై సబ్జెక్టుల వారీగా విద్యార్థులను సామర్థ్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తరగతులను నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ కనబరచాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వారి వెంట మండల విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అమ్తుల్ జమాల్ అస్రా, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



వేములపల్లి (మాడ్గులపల్లి) : ఇందుగులలో స్వపరిపాలన వేడుకలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేములపల్లి (మాడ్గులపల్లి) : మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్‌ఎం భీక్షం బహుమతులు అందజేశారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలి



వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చింతపల్లి: ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వసతి కల్పించాలని ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ కోరారు. మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్స్ జిల్లా అధికారి డిప్యూటీ డైరెక్టర్ దుర్గ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేకపోవడంతో అర్ధాకలితో చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరుడు అంజయ్య, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అమ్తుల్ జమాల్ అస్రా, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రమావత్ లక్ష్మణ్, నేరళ్లపల్లి జైచరణ్, గణేష్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అధిక టోల్ రుసుం వసూలు అన్యాయం

మిర్యాలగూడ : మండలంలోని ఆలగడప పరిధిలో నిర్మించిన టోల్ గేట్ వద్ద అధిక రుసుం వసూలు చేయడం అన్యాయమని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. గురువారం మిర్యాలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోదాడ-జడ్చర్ల రహదారి విస్తరణ చేపట్టిన అదానీ కంపెనీ పనులు పూర్తి కాకముందే దొడ్డిదారిలో ఇక్కడ టోల్ గేట్ ఏర్పాటు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతుందని ఆరోపించారు. 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజల నుంచి టోల్ వసూలు చేయవద్దనే నిబంధన ఉన్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని అన్నారు. టోల్ వసూళ్లను అరికట్టేందుకు ప్రజలు న్యాయ పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో దైద నాగయ్య, మీర్జా, బుచ్చిరెడ్డి, రామన్న, మహేష్, పట్టేటి వెంకన్న, రమేష్, సైదులు, వంశీ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు





చికిత్స పొందుతున్న సింధు, గాయపడిన శ్రీను

నాగార్జునసాగర్: కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీకి చెందిన జటావత్ శ్రీను నాయక్ తన మనమరాలు నేనావత్ సింధుతో కలిసి ద్విచక్ర వాహనంపై పైలాన్‌కాలనీ నుంచి హిల్‌కాలనీకి వెళ్తుండగా.. ముత్యాలమ్మ దేవాలయం వద్ద కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనునాయక్, సింధు ఎగిరి రోడ్డు పక్కన కంప చెట్లలో పడిపోయారు. కారు డాష్‌బోర్డు పగిలి అద్దం ముక్కలు సింధు ముఖంపై గుచ్చుకున్నాయి. అటుగా వెళ్తున్న డెలివరీ బాయ్ పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. కారు నడుపుతున్న వ్యక్తి స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. మూలమలుపుల వద్ద కంప చెట్లు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృత్యువాత

పెద్దవూర : కుక్కల దాడిలో ఆరు గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన బుధవారం రాత్రి మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని బాసోనిబావితండాకు చెందిన రమావత్ సీతారాం గొర్రెలను సాకుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గొర్రెలను బుధవారం రాత్రి తన ఇంటి సమీపంలోని గుడిసెలో ఉంచి ఇంటిలో నిద్రపోయాడు. గురువారం వేకువజామున నిద్రలేచి గొర్రెల వద్దకు వెళ్లి చూడగా గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి ఆరు గొర్రెలను చంపేశాయి. మరో ఆరు తీవ్రంగా గాయపర్చాయి. గొర్రెలపై దాడిచేసిన కుక్కలు గుడిసె సమీపంలోనే తిరుగుతున్నాయి. బాధిత రైతు సీతారాం కుక్కలను అక్కడినుంచి తరిమివేసి విషయాన్ని తండావాసులకు, పశువైద్యాధికారికి తెలియపర్చాడు. పశువైద్యాధికారి డాక్టర్ చంద్రబాబు సంఘటన స్థలాన్ని సందర్శించారు.

డివిజన్‌లో బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని పౌల్ట్రీ ఫామ్‌లలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని, ఎవరూ ఆందోళన చెందొద్దని మిర్యాలగూడ పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ శంకర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల ఫారాలను పశు వైద్యాధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించారని, ఎలాంటి బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదన్నారు. ఆకస్మికంగా కోళ్లు చనిపోతే వాటిని గమనించి దగ్గరలో ఉన్న పశు వైద్యశాలలకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఆలగడప పశువైద్యశాల అధికారిణి డాక్టర్ దుర్గారమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పట్టుదలతో లక్ష్యాన్ని అధిగమించొచ్చు

● డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ టౌన్ : పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించవచ్చని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు అన్నారు. మిషన్ పరివర్తన్-యువతేజం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడలోని హౌసింగ్ బోర్డులో గల క్లియో స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. పోటీల్లో మిర్యాలగూడ టీమ్‌కు ప్రథమ బహుమతి, రన్నర్ అప్‌గా నిలిచిన పెద్దవూర రెండవ బహుమతి గెలుచుకుంది. ఈ సందర్భంగా విజేతలకు డీఎస్పీ బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐలు నాగార్జున, వీరబాబు, జనార్దన్, ఎస్ఐలు లోకేష్, సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, హరీశ్‌రెడ్డి, గోపాల్‌రావు, చల్లా శ్రీనివాస్, రాంబాబు, శ్రీనివాస్, పీడీలు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, శ్రీనివాస్, రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆర్మీ జవాన్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మనోజ్‌పై పోలీస్ స్టేషన్ వద్ద దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరశురాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మిర్యాలగూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు రక్షణగా ఉండే పోలీస్ స్టేషన్‌లోనే పోలీసులు చూస్తుండగా దళిత ఆర్మీ జవాన్ మనోజ్‌పై అగ్రకులాలకు చెందిన వారు దాడికి పాల్పడటం దారుణమన్నారు.

జవాన్ మనోజ్‌పై దాడిని ఖండిస్తున్నాం

త్రిపురారం: ఖమ్మం జిల్లా బోనకల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అన్నారు. గురువారం సంఘం సభ్యులతో కలసి నిడమనూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్మీ జవాన్ మనోజ్‌పై దాడి చేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీతో పాటు హత్యానేరం కేసులు నమోదు చేయాలన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

దేవరకొండ: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. గురువారం దేవరకొండ మండలం తాటికోల్, ముదిగొండ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

వేములపల్లి : మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల మహాసభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కుర్ర సైదానాయక్.. సంఘం జెండా ఎగురవేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా మాతంగి కార్తీక్, కార్యదర్శిగా పుట్ట సంపత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, నాయకులు పతాని శ్రీను, వడ్డెగాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఎంఎస్' కొలతలను రద్దుచేయాలి

కొండమల్లేపల్లి: ఉపాధి హామీ పథకంలో నేషనల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎస్ఎంఎస్) క్యూబిక్ మీటర్ కొలతలను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో కావలి కృష్ణయ్య, కూలీలు సైదమ్మ, కడారి నారయ్య, కె.లక్ష్మమ్మ, ఊరె ఈదమ్మ పాల్గొన్నారు.

షేక్ మహబూబ్ మృతి బాధాకరం

కొండమల్లేపల్లి: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన ఓ పత్రిక విలేకరి మొహినుద్దీన్ తండ్రి షేక్ మహబూబ్ మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం గ్రామంలో షేక్ మహబూబ్ భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సిరాజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాటమయ్య రక్షణ కవచాలను అందజేయాలి

హాలియా : కాటమయ్య రక్షణ కవచాలను నిజమైన కల్లుగీత కార్మికులకు, సభ్యత్వం కలిగి గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేములకొండ పుల్లయ్య కోరారు. గురువారం హాలియా పట్టణంలో జరిగిన కల్లుగీత కార్మికుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గీత కార్మికుల సంక్షేమానికి వచ్చే బడ్జెట్‌లో రూ. 5వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి నర్సింగ్ సైదయ్య, అధ్యక్షుడు కాట్నం యాదగిరి, నాయకులు సత్తెయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

మిర్యాలగూడ : పట్టణ పరిధి, మండలంలో గల ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ హరిబాబు అన్నారు. గురువారం పట్టణ శివారులో గల సర్వే నంబర్ 626లో గల 6 ఎకరాల 10 గుంటల భూమిని సర్వే చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2015 సంవత్సరంలో రూరల్ పోలీస్ స్టేషన్‌కు 1.15 ఎకరాల స్థలాన్ని అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు ఠాకూర్ రామకృష్ణ, సత్యనారాయణ, సర్వేయర్లు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం

కొండమల్లేపల్లి: పేద విద్యార్థులకు చేయూతనందిస్తామని కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ రేఖాశ్రీధర్‌రెడ్డి అన్నారు. కొండమల్లేపల్లి పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు తన సొంత ఖర్చుతో స్టడీ మెటీరియల్‌ను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగ్యానాయక్, సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

కొండమల్లేపల్లి: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు లాలునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు.